

సంపుటి : 7
సంచిక : 3
త్రైమాసిక పత్రిక
జూన్ 2004

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
22-1-50
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)
231808 (R)

**ముద్రణ**
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్ :
2798072,
2740222

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ జై !
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్నమాట

అణువు అణువునా అలరారే సద్గురుని తత్త్వాన్ని, కొందరు గీతముల ద్వారా కొనియాడినారు. కొందరు తమ రచనల ద్వారా మానవాళికి అందించి మహనీయోపకారాన్ని చేసినారు. గురుకృప పత్రిక గురుదేవుల అనుగ్రహముతో ఈ గురుపూర్ణిమ సంచిక ద్వారా సాయినాథుని చరిత్ర కారునికి శుభాభివందనములు తెలియజేయుచున్నది. రమ్యమైన రామకథను రసరమ్యముగా వాల్మీకి మహర్షి రామాయణంగా మలచి అందించినారు. భారతీయ సనాతన సంస్కృతిని, ధర్మాన్ని వ్యాస మహర్షి మహాభారతంలోను, భాగవత భక్తి మార్గాన్ని భారతావనికి భాగవతమను పేర కృష్ణద్వైపాయన మహర్షి అందించినారు.

ఈ కోవలోనే గురుకృపకు పాత్రుడై గురుసేవా తత్పరుడైన హేమాడ్‌పంతు బాబా అనుమతితో సాయి సచ్చరితను సాయి భక్తులకు అందించి నేటికి 75 సం॥రముల కాలమైనది. ఈ తరుణాన హేమాత్పంతునికి ప్రతి సాయిభక్తుడు తనవంతు కృతజ్ఞతలను తప్పక తెలియజేయుట కర్తవ్యమని భావించాలి. తలిదండ్రుల, గురుని ఋణములు తీర్చుకొనలేనివి. దేవతా ఋణము, కవి ఋణము తీర్చుకోవాలని శాస్త్రవాక్యం. ఇవి స్మరణ, మనన, కృతజ్ఞతల వలన కొంత ఊరటపడుతుంది. నేడా పనిని "గురుకృప" గుర్వానుగ్రహమునొంది సంతోషంగా నిర్వహించనున్నది.

హేమాడ్‌పంత్ 1859 సం॥ ఠాణా జిల్లా కేళ్వేమాహిము నందు జనన మొందినారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వలన మొదట 5వ స్టాండర్డ్ వరకే చదివి బడిపంతులుగా ఉద్యోగమారంభించినారు. ఆ

తరువాత స్వయంకృషితో తలారీయను గ్రామోద్యోగిగాను, ఇంగ్లీషు గుమాస్తా గాను, కచేరీలో హెడ్ గుమాస్తాగాను, అటవీ శాఖలో ఉద్యోగిగా, కరువు సంబంధపు పనులలో ప్రత్యేక ఉద్యోగిగా, మమల్తాదారుని గాను, రెసిడెంట్ మెజిస్ట్రేట్‌గాను, అంచెలంచెలుగా పదోన్నతి చెందుతు 1916లో పదవీ విరమణచేసారు.

స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగిన హేమాత్పంతుకు గురుకృపపై సరియైన అవగాహన లేదు. బహుశా కారణమిది యైనందునేమో 1940లో బాబా దర్శనార్థమై శిరిడీకి వచ్చి సాఠెవాడాలో బసచేసిన సమయంలో బాలాభాటేకు హేమాత్పంతుకు మధ్య వాగ్వివాదము జరిగింది. ఆదిశంకరుల ఆత్మబోధ, వివేకచింతామణి వంటి గ్రంథాలను బాగా వంటబట్టించుకున్న వాడైనందునేమో!

మన స్వేచ్ఛను విడిచి ఇంకొకరికి ఎందుకు లొంగవలెను. మన కర్మలను మనమే చేయునప్పుడు గురువు యొక్క అవసరమేమి. తనంతట తానే కృషి చేసి మిక్కిలి యత్నంతో జన్మదుఃఖములను తప్పించుకోవాలి. ఏమీ చేయక సోమరిగా ఉండువానికి గురువేమి చేయగలడు (సాయి సచ్చరిత్ర పత్తి నారాయణరావు గారి అనువాదం) అని స్వేచ్ఛా పక్షముచేసిన హేమాత్పంతు బాబాను చూడగానే, ఏమిటి ఈ హేమాత్పంతు అనుచున్నాడు – దేనిపై మీ వాదన అనగానే హేమాత్పంతులో భయ, విస్మయ, ఆశ్చర్యములొక్కసారి ఆవహించి బాబా పాదములపై పడిన తరువాత జరిగిన దేమిటో సాయిసచ్చరిత్ర చదివిన వారికందరకు విశదమే.

గోధుమ పిండి ద్వారా కలరా నిర్మూలనము గావించిన సాయినాథుని లీలగాంచి హేమాత్పంతు బాబా సచ్చరిత్రను వ్రాయవలెనను తలంపు 1910లో కలిగి శ్యామా ద్వారా బాబా అనుమతిని పొంది, 1918 బాబా సమాధి చెందక మునుపు రెండు అధ్యాయములు వ్రాసిన వ్రాతప్రతిని చూపించినను. విషయసేకరణలోను, భక్తుల అనుభవాలను సంపాదించుటలోను కొంత తడవైనందున 1922 సం॥ శుక్ల నామ సంవత్సరం చైత్రమాసంలో రచన ప్రారంభించినట్లు కొంత ఆధారముంది. 1929 సం॥ తాను వ్రాయదలచింది వ్రాసినాడు. 1923 సం॥ 1930 సం॥ సాయిలీలా మాస పత్రికలో ధారావాహికంగా ప్రచురణ జరిగినను 1929 సం॥ ఆషాఢ శుద్ధనవమి నాడు హేమాత్పంతు కైలాసవాసియైనారు. తరువాత బి.వి. దేవ్ సహాయంతో సాయిసచ్చరిత్ర పూర్తియైంది. ఇందులో విశేషమేమంటే తాను వ్రాయదలచుకొనిన చరిత్ర 1929 సం॥లో జ్యేష్ఠ మాసంలో పూర్తి అయింది. వ్రాతప్రతి పూర్తి అయిన పదిరోజుల తరువాత హేమాత్పంతు సాయినాథుని పదసన్నిధికి చేరారు.





1944 సం॥ ఆంగ్లభాషలో గుణాజీ అనువారు The wonderfull life and Teachings of Sri Sai Baba అను పేరున మరాఠీ నుంచి అనువదించారు.

ఆ తరువాత విజయనగరం నివాసులైన శ్రీ పత్తి నారాయణరావుగారు గుణాజీగారు ఆంగ్లభాషలోనికి అనువదించిన సాయిచరితను తెలుగు భాషలోనికి అనువదించి, 1953 సం॥ మే నెల 19 తారీకున మొదటి ప్రతిని సాయిలీలమ్మ గారికి శిరిడీలో సమాధిమందిరమందు ఇచ్చినారని ప్రతీతి ఉంది.

మొదట మొదటగా ముద్రించిన తెలుగు సాయి సచ్చరిత్రల్లో సాయిబాబా జీవితచరిత్ర – ప్రభోదము – నిత్య పారాయణ గ్రంథమని ఉండేది.

ఏది ఏమైనను సాయినాథుని చరిత్రను మరాఠీ భాషలో హేమాత్పంతు, ఆంగ్లభాషలో గుణాజీ, తెలుగులో పత్తి నారాయణరావు గారు అందించినందుకు వారికి కృతజ్ఞతలను తెలియజేయవలసిన బాధ్యత ప్రతి సాయి భక్తునిపై ఉంది. మూల రచయిత అందించి 75 సంవత్సరాలైనది. పత్తి నారాయణరావు గారితో పాటు మరాఠీ భాష నుండి ఇతర భాషలలోనికి అనువదించిన వారందరికీ సాయినాథుని కృప పొందవలెనని కాంక్షించుతూ, సెలవు కోరుతూ – అంజలిఘటించి....

**- గురుకృప**

## అంతరార్థం - అర్థం కానిదే సమర్థుని - సమర్థత - బోధపడదు

బాబా చరితలో ఏ లీల తరచి చూచినా తన బిడ్డలకు వ్యక్తమయ్యేవి వారి సర్వజ్ఞత, సర్వవ్యాపకత, సర్వసమర్థతలే. వాటి అవగాహనతో ఆశ్రితుల భక్తి విశ్వాసాలను (బాబా, బాబూజీ) ఎన్నో రీతుల పటిష్ఠపరిచి, వారిని శరణాగతి మార్గంలో పయనింప చేసిన పథమే సద్గురు పథం. ఎరుక, మరపుల ఏరువాకలో ఎటు వెళ్తున్నామో తెలియని మనకు కన్పించిన చుక్కాని బాబూజీ. మేఘావృతమైన మన మనస్సులకు వారి జాడ అంతగా కన్పించదు, మార్గం చూపిస్తున్న వారి భాష అంతగా అవగతమవ్వదు. "The one who gives, also knows how to make you receive", అయితే ఇవ్వటమే కాక, ఇచ్చింది స్వీకరించే శక్తిని కూడా ప్రసాదించి తన బిడ్డలకు ఇహమై, పరమై, ఇహపర శ్రేయోదాయకమైన సద్గురు లీలామృతం ఎంత గ్రోలినా తనివి తీరదు. మహాత్ములు వారియొక్క సంకల్పం లేకుండా స్వప్నగత అనుభవమివ్వరని శాస్త్రవాక్యం. అయితే సాయి సాంప్రదాయం భిన్నమైనది కదా! వారిచ్చే ప్రతి అనుభవానికి మరొక విషయం తోడవుతుంది.



అదే రాజముద్రిక. రాజాధిరాజైన సద్గురుదేవుని అనుగ్రహముద్రిక. నన్ను ఆశ్రయించిన నీకు, నీ వారికి నా అండ ఎల్లప్పుడూ ఉందనే **అభయ ముద్రిక**.

నాకు, నా ఫోటోకు భేదం లేదు అన్న బాబా మాటలకు నిదర్శనంగా – మన గురువు ఎక్కడో ఉంటారు, మనం గురువుగారి ఫోటోకి చెప్పుకుంటే సరిపోతుందా! అని అనుకుంటూ ఉండేదాన్ని.

సెప్టెంబరు 17 రాత్రి నాకు గురువుగారు కలలోకి వచ్చి మా యింటిలో రెండు రోజులు మౌనంగా ఉండి వెళ్ళే ముందు నీ బిడ్డను కాపాడాను అని చెప్పారు. గురువుగారు వెళ్ళిన తరువాత ఏమిటి నా బిడ్డను కాపాడానని చెప్పారు అని ఆలోచించాను.

ప్రతి ఉదయం సచ్చరిత్ర పారాయణ చేయటం నియమంగా మారింది. మా వారు ఉదయమే షటిల్ ఆడడానికి వెళ్తారు. గురువుగారు వచ్చి నీ బిడ్డను కాపాడానన్నారు ఏమిటో తెలియడం లేదు అన్నాను. అది తెలిస్తే ఆయన కాపాడినట్లు నీకు ఎలా తెలుస్తుంది. చూడు నీకే తెలుస్తుంది అన్నారు. మా అమ్మాయి అనుపమకు జడవేస్తూ నాకు గురువుగారు కన్పించి నీ బిడ్డను కాపాడాను అన్నారు అన్నాను, నీకు ఒక విషయం చెప్పితే నన్ను తిట్టవు కదా అంది. సర్లే చెప్పమన్నాను.

17 తారీఖు మధ్యాహ్నం ట్యూషన్‌కు సైకిల్‌పై వెళ్తూ పెద్ద డ్రైనేజీలో నీరు ఎక్కువగా పారుతున్న దానిలో పడబోయి షాక్ అయినట్లుగా బ్రేకు వేసి ఆగిపోయింది. ఆ చుట్టుప్రక్కల ఎవ్వరూ కూడా లేరు రక్షించటానికి. సైకిలు ప్రక్కకు తీసి బాబా, గురువుగారు నన్ను రక్షించారు అని అనుకున్నాను అన్నది. కాపాడటం ఏమిటో అర్థమైంది.


మనల్ని చూసేవాళ్ళు, మనం – బాబా భక్తులమనుకుంటున్నాం. కానీ, మనం బాబా దృష్టిలో ఉన్నామో, లేదో అని సందేహించేదాన్ని. ఇక అనుమానమే లేదు గురువుగారు దృష్టిలో నేను ఉన్నాను. మనందరం కూడా ఉన్నాము అని అనుకున్నాను. ప్రతి ఒక్కరికి గురువు ఉంటే వారి జీవన విధానం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది అని.

గురువుగారికి కృతజ్ఞతలతో

**– సత్యవతి (చిట్టి)**, స్టీల్‌ప్లాంట్

**"స్మృతిలో సదా గురువుని నిలుపుకోవడమే - సర్వశృతుల సారం"**

**"అవగాహన, ఓరిమిలతో కూడిన ప్రేమనే - విశ్వాసము లేక నిజమైన భక్తి అంటారు"**



## అనుకున్నది అనుకున్నట్లుగానే

*సద్గురు కృపతో నీటి చుక్కేపడని ఎడారి ప్రదేశంలో కూడా ఎండి మోడు వాడిపోయిన చెట్టుకు సైతం పుష్కలంగా ఆకులు వేస్తాయి, పూలు పూస్తాయి, పండ్లు కాస్తాయి. ఇవన్నీ ఎట్టి* ***ప్రయత్నం లేకుండానే*** *జరిగిపోతాయి. (సా.స.చ. అ॥ 3-24వ ఓవీ). గురుకృప కోసం మనమేం చేయాలి, ఏం చేస్తే మనకు గురుకృప లభిస్తుంది. ఏదైనా చేస్తే లభించేదికాదు గురుకృప,* ***మనకు అవసరమున్న నాడు సద్గురువు అనుగ్రహంతో లభించేది గురుకృప.*** *మసీదుమాత ఒడిలో చేరిన ధూమాల్ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు తన ఉద్యోగంలో. దయాళువైన సాయిమాత, తన ఉద్యోగంలో తాను ఏమీ కోరకనే ఇంకా కొంత ఎక్కువ మొత్తంలో జీతం లభించేటట్లు అనుగ్రహిస్తారు. అడిగినవన్నీ ఇచ్చే సద్గురుమాత, అంతర్లీనంగా ఉండే కోర్కెలను కూడా మన ఆనందం కోసం తీరుస్తారు. ఇక్కడ మరొక విశేషమేమంటే - మన చుట్టూ ఋణానుబంధంతో ఉన్న జీవుల అనుభూతికి, ఆనందానికి సద్గురువు అవకాశమిస్తారు మనలను మిషలుగా చేసి. అదే సద్గురుని విశిష్ఠ మార్గం.*

***- గురుకృప***

*బాబా, గురూజీలకు నమస్కరిస్తూ...*

నా పేరు అనీల్ కుమార్. నేను హైదరాబాద్‌లో E.C.I.L. లో వున్నాను. మా బావగారిది UPS లు తయారుచేసే బిజినెస్. UPS లను parcel లొ వేయడానికి S.R. Nagar వెళతాము. నేను ఆటోలో వెళ్ళేటప్పుడుగాని, వచ్చేటప్పుడుగాని బేగంపేటలోని ఒక five star hotel ని చూస్తుండే వాడిని. వెంటనే మనస్సులో ఈ hotel కి నేను ఒక్కసారైన వెళ్ళగలనా? లేదా? అని అనుకుంటూ ముందుకు వెళ్ళిపోతుండేవాడిని. అటు పనిమీద వెళుతున్నప్పుడల్లా మనసులో ఇలా అనుకునే వాడిని.

మా నాన్నగారు తెనాలిలో ఉంటారు. ఒకసారి నాకు ఫోన్ చేసి మనకు సువెన్ ఫార్మా కంపెనీలో షేర్లు ఉన్నాయి. బేగంపేటలోని గ్రీన్‌పార్కు హోటల్లో ఆ కంపెనీ జనరల్ బాడీ మీటింగ్ సాయంత్రము 3 గంటలకు ఉంది. నీవు వెళతానంటే proxy form పంపుతానన్నారు. వెంటనే పంపండి! వీలైతే వెళతాను అని చెప్పాను. వెంటనే కొరియర్ ఇచ్చారు. మా యింటికి కొరియరతను ఫోను చేసి మీ అడ్రస్సు నాకు అర్థం కాలేదు అని, అడ్రస్సు కనుక్కొని సరిగ్గా 3 గంటలకు మా ఇంటికి తెచ్చి ఇచ్చాడు. నేను అప్పుడే ఆఫీస్‌కి వెళ్ళబోతూ కొరియర్ వచ్చింది కదా అని, వెంటనే బేగంపేటలోని గ్రీన్‌పార్కుకి వెళ్ళాను. నాకు అప్పుడు అర్థమయింది, నేను ఏ హోటల్‌కి అయితే





వెళ్ళగలనో, లేదో అని అనుకునే వాడినో ఆ హోటల్ పేరే గ్రీన్‌పార్కు అని.

సరిగ్గా 4 గంటలకు హోటల్‌లోకి అడుగు పెట్టాను. చాలా ఆనందంగా ఉంది. అలా తలుపు తీసుకుని లోపలికి అడుగు పెట్టబోతున్నాను, వెనక నుండి sir అని వినపడింది. చూస్తే అతను నా షర్ట్‌కి ఉన్న సాయిపథం బ్యాడ్జి చూసి చాలా బాగుంది, బాబాకి క్రింద ఉన్నది ఎవరు అని అడిగాడు. ఆయన మా గురువుగారు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ గారు, షిరిడీలో ఉంటారు అని కాసేపు సత్సంగము చేసాను. ఆయన ఆ బ్యాడ్జి నాకు కావాలి అని అడిగితే, షర్ట్‌కి ఉన్న బ్యాడ్జిని తీసి ఇవ్వబోయాను, వెంటనే అతను నాకు మీ షర్ట్‌కి ఉన్న బ్యాడ్జి వద్దు, ఇంకొకటి ఉంటే ఇవ్వండి అన్నాడు. నా దగ్గర ఇంకొకటి ప్రస్తుతానికి లేదు, అయినా నేను తీసుకోగలను అంటున్నా అతను వద్దు అని తీసుకోలేదు.

విజయదశమికి శిరిడీలో నా స్నేహితుడు నాగనాథ్, బాబా మరియు గురువుగారి లేటెస్ట్ ఫోటో ఒకటి నా జేబులో పెట్టినాడు. ఆ ఫోటో జేబులో ఉంది. అది తీసి ఇచ్చాను. అతను చాలా సంతోషముగా తీసుకున్నాడు. తీసుకుంటూ శిరిడీ వెళ్ళాలి అనుకుంటున్నాను. బాబాని చూడాలని ఉంది. ఇంత వరకు శిరిడీ వెళ్ళలేదు. కాని ఈ రోజు చాలా ఆనందంగా ఉంది. త్వరలోనే శిరిడీ వెళతాను అని చెపుతూ నేను వెళ్ళాల్సిన మీటింగ్‌కి దారి చూపాడు. నేను చాలా నిదానంగా పరిసరాలను గమనిస్తూ మీటింగ్ హాల్‌కి వెళ్ళాను. అప్పటికే మీటింగ్ అయిపోయింది. అందరూ విందు తీసుకుంటున్నారు. నేను కూడా వాళ్ళతో join అయ్యాను. 40 నిమిషాలు ఆ హోటల్‌లో బాగా తిరిగాను. నిజానికి నేను గురువుగారికి ఒక్కసారి ఆ హోటల్‌కి వెళ్ళాలనుకుంటున్నానని కూడా చెప్పుకోలేదు, ప్రార్థించలేదు. అది నా మనస్సులో అంతర్లీనంగా ఉన్న కోరిక. అంతర్లీనంగా ఉన్న నా కోరికను చాలాచక్కగా సందర్భోచితంగా నేను ఊహించని విధంగా తీర్చినారు. ఆ హోటల్ బయట 5 నిమిషాలు బాబా గురించి, గురువుగారి గురించి మాట్లాడుకొనే అవకాశం కల్పించి, ఇది తీర్చింది 'నేను' అన్న ఎరుక కలిగించారు. అడగకుండా మనసులోనే ఉన్న కోరికలను కూడా తీరుస్తున్న గురువుగారికి వేరేగా మన కోరికలు చెప్పుకోవాలా? అనే ప్రశ్న నాకు ఉదయించక మానిందికాదు.

**గురుబంధువు**

**అనిల్‌కుమార్ .కె**

**కేవలం కనులు పదాలవెంట సాగడం కాదు. ప్రార్థనలోని భావం మనసులో కదులుతుండగా బాబా రూపాన్ని కన్నుల్లో నిలుపుకున్నప్పడే, మన హృదయ దీపం బాబా చరణాలముందు ఆరతిగా, ఆరని జ్యోతిగా కలకాలం నిలిచిపోతుంది - "ఆరతి ప్రార్థన" - సుచిత్రాదేవి**





## చేదు విషంలో - తీయదనం

సాయిపదసన్నిధానంలో ఎన్నో వింత వింతవైనాలు, భిన్న చర్యలు, విభిన్నమైన అనుభవాలు. ఇక్కడ మనకు అగుపించేవి. బాబా చేసిన వింత చర్యలు. కాని తెరచాటున, అనుగ్రహం మాటున దాగున్నది సాయి అపార కరుణ మాత్రమే! బాబా మాటలకు, భక్తుని విశ్వాసానికి తప్ప మరే విషయానికి ఇందు ప్రాధాన్యత లేదు. పాము కాటుకు గురైన శ్యామా, విషం శరీరమంతా వ్యాపిస్తున్నదన్న విషయాన్ని కూడా లక్ష్య పెట్టకుండా, ఆ విషం నుండి తనను కేవలం బాబా యొక్క అనుగ్రహమే రక్షిస్తుందన్న విశ్వాసంతో మసీదు చేరాడు. కోపోద్దీపితుడైన బాబా గద్దించి **'పో, వెడలిపొమ్ము, క్రిందకు దిగు'** అంటూ వారి వాక్కుతో విషాన్ని వ్యాపింపకుండా చేసారు. సద్గురు అవతార కార్యంలో మనమందరం గురుసన్నిధానాన్ని చేరుకున్నాం. ఇక్కడ మరొక వింత చర్య. తనకు తెలిసిన నాటు వైద్యాన్ని చేసుకొని, ప్రాణం మీదకి తెచ్చుకొన్నారు ఒక గురుబంధువు. వైద్యులు తాము చేయగలిగింది ఏమీలేదన్నారు. చివరకు ఆ గురుబంధువు బాబా, బాబూజీలనే శరణనన్నాడు. విశ్వసించిన దైవాన్నే వేడుకున్నాడు. ఇలా సంఘటన ఏదైనా తేటతెల్లమయ్యేది ఒక్కటే విషయం. సద్గురువుకు మనపై ఉన్న అపారమైన, అవ్యాజమైన ప్రేమే తన బిడ్డలకు ప్రాణవాయువు అని. ఆ ప్రేమే గురుకృప అని.

మాది ఎర్రగుంటపాలెం, కందుకూరు. నా పేరు ఎలికా గంగయ్య. ఈ రోజు నేను జీవించి ఉన్నానంటే అది సద్గురుదేవులైన బాబా, బాబూజీగార్ల దయ మాత్రమే! నాకున్న ఒక శారీరక ఇబ్బంది కోసంగా నాకు నేనుగా ఒక నాటువైద్యం చేసుకున్నాను.ఆ వైద్యానికి ఒకటి, రెండు ఉమ్మెత్త గింజలు తినవలసి ఉంది. నేను సగం కాయ తిన్నాను. ఇది విషకారి అని నేను ఊహించలేదు. ఇలా తిన్నానన్న విషయాన్ని కనీసం నా భార్యతో కూడా చెప్పలేదు. ఇలా ఉండగా ఒక ఊహించని సంఘటన జరిగింది. నాకెందుకో నేను అపస్మారక స్థితిలోనికి వెళ్ళిపోతున్నానన్న భావన కలిగి 'బాబా' అంటు పెద్ద కేక వేసి పడిపోయాను. ఇలా భయం కలిగిన క్షణాన్నే బాబాకు, గురుదేవులకు మీరే నన్ను కాపాడాలని ప్రార్థించాను. తర్వాత నేను అపస్మారకంగా అయిపోయాను. కాళ్ళు, చేతులు విపరీతంగా కొట్టుకున్నాయట. అందరు నా పరిస్థితి చూసి బ్రతుకుతానన్న ఆశ వదులుకున్నారు. వెంటనే అందుబాటులో ఉన్న డాక్టరు వద్దకు తీసుకొనివెళితే, అవకాశం లేదని పంపించేశారు. మా వాళ్ళంతా కలిసి ఇంకొక డాక్టరు దగ్గరకు తీసుకొనివెళితే, సెలైను పెట్టి, తీసివేసి మా వల్లకాదు ఒంగోలు తీసుకువెళ్ళమన్నారు. ఒంగోలు చేరేంతవరకు నేను జీవించడం సందేహమే అయినా, ఒంగోలు తీసుకు వెళ్ళారు. అక్కడి డాక్టరు గుంటూరు లేదా హైదరాబాద్ తీసుకువెళ్ళమని చెప్పారు. ఇక ఆశ వదులుకున్న మా వాళ్ళు, డాక్టరు గారిని వైద్యం చేయమని అడిగారట. ఎట్లా జరిగినా ఇబ్బంది లేదంటేనే ఆయన వైద్యం ప్రారంభిస్తూ, అందరితో మీ ఇష్ట





దైవాన్ని ప్రార్థించుకోండి, నా చేతుల్లో ఏమీ లేదంటూ వైద్యం చేశారు. నాతో ఉన్నవారికి, నాకు బాబా, గురుదేవులే దైవం. అందరు బాబాని, గురువుగార్ని నన్ను కాపాడమని వేడుకున్నారు. ఎట్టకేలకు **గురు అనుగ్రహంతో** ఈరోజు ఆరోగ్యంగా తిరగగలుగుతున్నాను. డాక్టరు అన్నారట, ఇలా ఉమ్మెత్త గింజలు తిన్నవాళ్ళు బ్రతికింది తక్కువని. నేను చేసుకుంది పొరపాటు వైద్యమైనా, గురుదేవుల అపార కరుణ నన్ను కాపాడింది. నాకు కొత్త జీవితాన్నిచ్చింది.

**గురుబంధువు**

**ఎలికా గంగయ్య**

**మాకు భక్తి గురించి ఏం తెలుసని! ఇతరులందరూ మమ్ములను వదిలిపెట్టినా, సాయి మాత్రం మమ్ములను వదిలిపెట్టరు. - సాయి సచ్చరిత్ర - అధ్యాయం 30 - 6వ ఓవీ!**

## ఆధారపడితే - అప్పనిదేముంది

నా పేరు రమాలక్ష్మి. మాది బుర్రిపాలెం. నేను హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాను. గురువుగారి అనుగ్రహంతో జరిగిన అనుభవాలు మీతో పంచుకొంటున్నాను. నేను, మా నాన్నగారు 14-08-2001న బయలుదేరి షిరిడీ వెళ్ళినాము. 15-08-2001న శిరిడీలో 16-08-2001నకు శిరిడీ నుంచి తెనాలికి రిజర్వేషను చేయించినాము. టిక్కెట్ మీద మన్‌మాడ్ ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ చేసినారు. మేము హైదరాబాద్ నుంచి తెనాలి వెళ్ళాల్సిన కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్ పేరును టిక్కెట్‌లో పొందు పరచలేదు. ఆ టిక్కెట్ అలానే తీసుకొని 16న బయలుదేరినాము. 17 ఉదయం ట్రైన్ దిగి పంజాగుట్టలో ఉన్న అక్కవాళ్ళ ఇంటికి వెళ్ళినాము. అక్కడ నుంచి బయలుదేరి ఉదయం 11.30 కి బస్‌స్టాప్‌కి వచ్చి నాంపల్లి స్టేషన్‌కి వెళ్ళటానికి బస్ కోసం వేచి చూసి, పది నిముషముల తరువాత బస్ ఎక్కాము. బస్ ఎక్కిన తరువాత ఆలోచించాను కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్ నాంపల్లిలో 12.00 గంటలకి బయలుదేరుతుందేమో అని ఖచ్చితమైన టైమ్ తెలియదు. నాంపల్లి స్టేషన్ చేరేసరికి కళ్ళముందు కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయింది. వెంటనే సికింద్రాబాద్ స్టేషన్‌కు బయల్దేరి 12.25 కు చేరుకున్నాం. సికింద్రాబాద్ నుండి తెనాలికి రిజర్వేషను వుంది కాని బెర్త్ నంబరులు ఇవ్వలేదు టికెట్‌పైన, కనుక మాకు రిజర్వేషన్ లేదు కదా, జనరల్ బోగీ ఎక్కాలనే మా ఆలోచన. ట్రైన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం మీద ఉన్నది, ముందు రిజర్వేషను బోగీలు ఉన్నాయి. జనరల్ బోగీ ఎక్కటానికి పరిగెడుతూ ఉన్నాము. టైమ్ అయిపోతున్నది. AC బోగీలు దాటి జనరల్ బోగీకి వెళ్ళేటప్పటికి ట్రైన్ కదులుతుందేమో అని S1 బోగీ దగ్గరకు రాగానే ఆలోచించి



S1 బోగీలోకి ఎక్కినాము. సీటులో కూర్చోగానే ఆలోచన వచ్చింది. రిజర్వేషన్ టికెట్ ఉన్నది. కొచ్చిన్ జనరల్ బోగీ బాగా రద్దీగా ఉంటుంది కనుక గురువుగారు ఈ సంఘటనతో మమ్మల్ని రిజర్వేషను బోగీ ఎక్కించారని అనుకుంటూ కూర్చున్నాము. ఈలోపు టి.సి. వచ్చి టిక్కెట్ చూసి మారు మాట్లాడకుండా మేము కూర్చున్న బెర్త్ ఖరారు చేసి వెళ్ళిపోయాడు. గురువుగారు చేసిన ఈ చర్యకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఎలాంటి ఇబ్బంది కలగకుండా గురువుగారు మమ్మల్ని తెనాలి చేర్చారు. మేము 14న శిరిడీ మన్‌మాడ్ ఎక్స్‌ప్రెస్‌కి బయలు దేరినాము కదా. 15న ఉదయం ఔరంగాబాద్‌కి, శిరిడీకి మధ్యలో లాసుర్ అనే ఊరి దగ్గర ట్రైన్ ఒక గం॥ ఆపినారు. నేను, ఏంటి బాబా ఇలా జరిగింది ఒక గంట ముందు మీ సన్నిధికి వచ్చేవాళ్ళము అనుకొని, ఏదో మంచికే ఇలా చేశారు అని అనుకొన్నాను. 17న మేము తెనాలి వస్తున్నప్పుడు కొచ్చిన్ ఎక్స్‌ప్రెస్‌లో మా ప్రక్క సీట్ అతను లాసుర్ స్టేషన్ మాస్టర్‌గా పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఉన్నాడు. అతను 15న ఉదయం లాసుర్‌లో ఆపిన ట్రైన్‌లో మీరు ఉన్నారా అని అడిగాడు, అవును అంటే, అంతకు ముందే గూడ్స్ ట్రైన్ ఒకటి తెగిపోయి కొన్ని పెట్టెలు అలాగే ఉన్నాయి. టైమ్‌కి మేము చూసి మన్‌మాడ్ ఎక్స్‌ప్రెస్ ఆపినాము, ప్రమాదం తప్పింది అని చెప్పాడు. ఆ విధంగా గురూజీ కాపాడినారు. గురూజీ శక్తి తెలిసిన మాకు ప్రాక్టికల్‌గా అనుభవమైన విషయాలు వ్రాస్తున్నాను. నేను చదివిన కాలేజీలో టి.సి. అప్లయి చేయటానికి వెళ్ళినాను. అంతా అయిపోయింది. ప్రిన్సిపాల్ మీటింగ్‌లో ఉన్నారు, తరువాత వచ్చి టి.సి. తీసుకొని వెళ్ళమన్నారు. నేను బుర్రిపాలెం వచ్చేసినాను. ఇంటినుంచి తెనాలి అమ్మకి (పెద్దమ్మ) కాలేజీలో లేటు అయింది పని పూర్తికాలేదు, కనుక మళ్ళీ రేపు రావాలి, రేపు కనిపిస్తాను అని ఫోన్ చేసినాను. అక్కడే ఉన్న పెద్దనాన్న విషయం తెలుసుకొని వెంటనే కాలేజికి వెళ్ళి ప్రిన్సిపాల్ చేత సంతకం చేయించి టి.సి. షాప్‌లో నాన్నకు ఇచ్చారు. ఆరోజు రాత్రి నాన్న తీసుకొని రాగానే చూసి ఆశ్చర్యపోయినాను. లేకపోతే గురువారం ఉదయం 6.00 నుండి 12.00 వరకు నామం అయిపోయిన తరువాత వెళ్ళి తెచ్చుకొందాం అని అనుకొన్నాను. నాకు ఇబ్బంది కలగకుండా ఉండటం కోసం గురువుగారు ప్రేమతో నాకు టి.సి. ఇప్పించిన వైనానికి చాలా సంతోషించాము.

ఒకరోజు ఆఫీసులో సెమినార్ చెప్పాల్సిన టర్మ్ నాది. నేను నా M.C.A. Project 'గురుకృప' పత్రికను ఆధారంగా చేసుకొని చేసాను. దాంతో గురుకృపను గురించి చెప్పే అవకాశం లభించింది. తద్వారా నా ఉద్యోగం కూడా గురూజీ స్మరణతోనే ప్రారంభమయింది.

**- రమాలక్ష్మి**





## మూర్తీభవించిన అనుగ్రహం - బాబూజీ

ప్రియమైన గురుబంధువులకు,

నా పేరు అనురాధ, నేను విశాలాక్షినగర్‌లో ఉంటున్నాను. గత నాలుగు సంవత్సరాలుగా మా అక్కగారింటిలో "సాయిబాబా సత్సంగము" జరుగుతుంది. నేను సత్సంగాలకు వెళుతూ ఉండేదాన్ని. నేను గత మూడు సంవత్సరాలుగా యుట్రస్ ఇబ్బందితో బాధపడుతున్నాను. డాక్టరుగారి సలహా ప్రకారం వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. కాని ఎందుకనో ఈ విషయంలో అశ్రద్ధ చేస్తూవచ్చాను. ఏదోదిగులు, భయం ఉండేది. ఆపరేషన్ మట్టుకు చేయించుకోవాలని ఉండేదికాదు.

నేను స్కూల్‌లో Incharge - Teacher గా పనిచేస్తున్నాను. వృత్తిరీత్యా ఎప్పుడూ సమయం దొరికేది కాదు (busy గా ఉండేదాన్ని). ఆదివారం సాయంత్రం ఒక గంట ఖాళీ చేసుకొని సత్సంగంలో కూర్చొనేదాన్ని. ఎప్పుడూ "గురుకృప" పుస్తకాలు చదవలేదు, సమయం కూడ ఉండేది కాదు. ఆరోజు మా స్కూల్‌కి సెలవు. అక్క దగ్గరకు వెళ్ళి ఒక "గురుకృప" పుస్తకం తీసుకొని బయట వరండాలో కూర్చొని చదువుతున్నాను.

ఇంతలో మాయింటికి 10.30 టైములో interior decoration వాళ్ళు వచ్చి వాళ్ళ product గురించి ఏదో చెపుతున్నారు. నాకు వినాలని interest లేదు, ఎందుచేతనంటే నేను పుస్తకం చదివే ధ్యాసలో ఉన్నాను. వాళ్ళు ఒక 10 ని॥లు చెప్పి నేను ఆసక్తిగా వినకపోవడంతో, పోని కేలండరు తీసుకొండి అని నా చేతిలో ఒక కేలండర్ పెట్టారు. చూస్తే "శ్రీ సాయిబాబా" కేలండర్. ఇక నా ఆనందానికి అవధులు లేవు. ఎంతో సంతోషం అనిపించింది. ఒక చేతిలో **"గురుకృప"** పుస్తకం, ఇంకో చేతిలో **"సాయిబాబా"** కేలండర్.

అది తీసుకున్న దగ్గర నుండి – డాక్టరు దగ్గరకు వెళ్ళు, ఆపరేషన్ చేయించుకో అని నా మనస్సు పదే పదే చెపుతున్నది. ఇది జనవరి 26, 2004న జరిగింది. ఫిబ్రవరి 4, 2004న నాకు ఆపరేషన్ అయింది. అంతా ఒక వారంలో ఒక కల లాగే జరిగిపోయింది.

శ్రీ సాయిబాబా, శరత్‌బాబూజీ గార్ల దయవల్ల నాకు అంతా సవ్యంగా ఎటువంటి ఆటంకములు లేకుండా ఆపరేషన్ అయింది. నేను ఈ రోజు ఆరోగ్యంగా తిరుగుతున్నాను. Hospital లో కూడా వారి ఫోటోలు పెట్టుకున్నాను. బాబా చరిత్ర చదువుతుండేదాన్ని. నేను వేసే ప్రతి అడుగు గత 18 సం॥లుగా బాబా నా చేత వేయిస్తున్నారు. సత్సంగముల వలన నాలో చాలా మార్పు కలిగింది.

**- అనురాధ (విశాఖ)**

**చెడనిహృదిలో పడని గుడిని నిర్మించుకో**





## పల్లకి ప్రభవించె - ప్రకృతి పరవశించె

"మనం చేస్తున్న కీర్తన, పారాయణ, భజన, సత్సంగం ఇత్యాది ఉపకరణాలన్నీ మన త్రికరణాలను సాధ్యమైనంతసేపు సాయి ఊసులో, సాయి ధ్యాసలో గడపడానికి" దోహద పడతాయన్న గురుదేవుల మాటలు వేదవాక్యాలే మనకు. అయితే "కీర్తించడం" ఎందుకు? బిడ్డలమైన మనపై వారు చూపిస్తున్న కరుణకు కృతజ్ఞత తెలియచేసుకోవడానికే. భక్తుల విశ్వాసాలను పటిష్ఠపరిచేందుకే సద్గురు లీలా ప్రబోధం కొనసాగేది. ఈ కీర్తించడమే మనం నిత్యం చేసే ప్రార్థనలోని 'పంచభూతాలు, అనంతమైన జీవకోటి, చరా చర సృష్టి నీవు తప్ప అన్యంకాదు'. భగవంతుడైన సద్గురువుకు పంచభూతాలు అధీనంలో ఉంటాయి. మంటలు విజృంభించి మసీదు దూలాలు అంటుకుంటుంటే చల్లార్చినా, కేవలం బాబా లీలలను, చమత్కారాలను చూద్దామని వచ్చిన భీమా అనుభవమైనా, ప్రధాన్ ఇంటికి చేరడానికి వర్షాన్ని ఆగిపొమ్మని ఆదేశించినా – బిడ్డలక్షేమమే ఆయన చూసింది. తద్వారా వారి విశ్వాసాలను పటిష్ఠపరిచిన సద్గురు సమర్థత నిత్య స్మరణీయం. ఉత్సవంగా చేసుకొమ్మని బాబా చెప్పిన ఏకైక సందర్భం గురుపూర్ణిమ. 'చేయి చేయి కలుపుకొని (మన మందరం) సాగే ఉత్సవ సందర్భంలో చెల్లూరు సత్సంగ సభ్యులు ఒక పరి ప్రకృతి తన చర్యతో కొంచెం ఇబ్బంది పెడుతుందేమోనని సందేహించారు. మనలో పరిణితి కలిగించి, మన విశ్వాసాలను పటిష్ఠపరిచేటందుకే సద్గురు లీలా విలాసం, అందుకే ఈ అనుభవం. ఇక్కడ విశేషం ఉత్సవమయ్యాక తనివితీరా ఆనందించేందుకు ప్రకృతి మాతకు కూడా అవకాశమిచ్చారు ఆ సద్గురుమూర్తి. ఇక అనుభవంలోకి....

అది చెల్లూరు గ్రామంలోని సాయిబాబా సత్సంగ కేంద్రం. గురుపూర్ణిమ సమీపిస్తుందనే ఆనందం, మనసులలో వెల్లివిరుస్తున్న తరుణం. గురుపూర్ణిమను శిరిడీలో జరుపుకోవాలన్న ఆర్తితో కదలి వెళ్ళింది ఒక సాయిభక్త బృందం. ఆర్ద్రతతో పిలిస్తే బాబా ఇక్కడికే తరలివస్తారు అనే ఆశతో శిరిడీ వెళ్ళే అవకాశం లేక అక్కడే నిశ్చలంగా ఉండిపోయింది మరియొక భక్తబృందం.

గురుపూర్ణిమ రానే వచ్చింది. ఉదయం 8.00 గం॥ కావస్తోంది, శ్రీ సచ్చిదానంద.... అంటూ జయ జయ ధ్వనులతో భక్తుల మదిలో నిండిన ప్రేమ భావం కడలిలో ఎగసిన కెరటంలా ఆ సత్సంగ హాలు నిండిపోయింది. ఆ జైజై ధ్వనుల మధ్య నామ సంకీర్తన మొదలైంది. భక్తుల కరతాళధ్వనుల మధ్య మువ్వన్నెల పుష్పమాలల అలంకరణలో చెరగని చిరునవ్వుతో బాబా; ఈ నీ చిరుమందహాసంలోనే అరుదైన ఇతిహాసాలు ఎన్నో అంటూ బాబూజీ – చిత్రపటాల కలయిక భక్తుల హృదయంలో మరింతగా పారవశ్యాన్ని నింపివేసింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం పూర్తయింది. మధ్యాహ్నం అలంకరణలో నిండుగా దర్శనమిచ్చారు బాబా, బాబూజీలు.


సాయంత్రం 7.30 అయ్యింది. భక్తుల దృష్టి అంతా బాబా, బాబూజీల పైనే. రెప్పపాటు కాలం మీ మోమును చూడకుండా ఉండలేము అంటూ రెప్పవాల్చటం మరచి మరీ భజనలో ఐక్యమైపోయారు. హోరు గాలి బలంగా వీస్తూ తీవ్రతను పెంచింది. ఆకాశాన నిండిన ఆ కారు మేఘాలు పూర్ణచంద్రుడ్ని పూర్తిగా కప్పివేశాయి.

బాబా - బాబూజీల చిత్రపటానికి అలంకరించిన పూమాలలు పదే పదే జారిపోతున్నాయి. బాబా, బాబూజీలు అందంగా ఉండాలి అంటూ పదే పదే సరిచేశారు. ప్లీజ్ అంటూ బ్రతిమలాడి చూశాము. కాని దండలు మాత్రం నిలవలేదు. బాబా, బాబూజీ ఎందుకిలా చేస్తున్నారు అంటూ చిన్నగా ఆత్మచింతనమొదలైనా ఉగ్రూతలూగిస్తున్న నామస్మరణలో దానిని వదిలివేశారు గురుబంధువులు. సమయం 7.50 కావస్తోంది. కానీ నా చర్యలు అగాధాలు అన్నట్లు బాబా యొక్క ఆ వింత చర్యకు అర్థం మా ఊరి గుడినుండి బాబా కదిలి సత్సంగ మందిరానికి పల్లకీ ఊరేగింపులో రావడం చివరిగా తెలుసుకొన్న భక్తుల కళ్ళు ఆనందంతో చెమర్చాయి. గుండె పట్టని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. పూజారి గారికి రేపు వర్షం వస్తుందంటే ఇవాళ పల్లకి తీయడమే గగనం. అటువంటిది? వాయుగుండం వుందని తెలిసినా, బలమైన గాలుల మధ్య, చీకటిన, పల్లకిలో బాబాను వెంటబెట్టుకొని వచ్చారు. మిగతా రోజులలో పల్లకీ ఉత్సవం జరిగినా సత్సంగ మందిరం ఉండే వీధికి రావడానికి కనీసం 8.30 అవుతుంది. అటువంటిది మేము రాత్రి 8.00 గం॥ నామ సంకీర్తను ముగిస్తామని తెలిసి హోరుగాలిలో హుటాహుటిన బాబా బయలుదేరి 7.50 గం.కి రావడం ఎంతో విశేషం. ఇది చాలు మాకు శిరిడీ వెళ్ళడం కంటే ఎక్కువ ఆనందమే మాకు దొరికింది అంటూ, మనసు నిండిన ఆనందంతో మోయలేని బాబా ఆప్యాయతానురాగాలతో హృదయపూర్వకంగా బాబాకు, బాబూజీకి నమస్కరిస్తూ మరొక్కసారి జై జై ధ్వనుల మధ్య ఆ కార్యక్రమాన్ని ముగించి ప్రసాదాలు తీసుకొని ఎవరి ఇళ్ళకు వారు తిరిగి వెళ్ళారు. పల్లకీ ఉత్సవం సాయిబాబా సత్సంగం జరిగే ఆ ఒక్కవీధికే వచ్చి ఆగిపోయి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

భక్తులు ఇళ్ళకు చేరారు. పల్లకీ గుడికి చేరింది. చిన్న చిన్న చినుకులతో మొదలై ఉధృత రూపం దాల్చిన మేఘుడు 10 రోజుల పాటు ఎడతెరపి లేక వర్షిస్తూనే ఉన్నాడు. శిరిడీ చేరిన బృందం తిరిగి చెల్లూరు చేరుకొని విషయం తెలుసుకొని ఎంతో ఆనందించింది. మేఘుడు విశ్రాంతి తీసుకొన్నాడు.

**- ఎం. సీతాదుర్గ ప్రసన్న**

**"ఒకానొక మహోన్నత ప్రేమానుభవానికి బాహ్యరూపం - పూజ"**





# సత్సంగం - చిరునామా

" 'ఏదైతే ఉన్నదో, అదే సత్. తన ఉనికికి యే కారణం లేక అన్ని కారణాలకు తానే కారణమైన సత్వమే 'సత్' అదే సత్యం. ఆ సత్ పదార్థంతో అనుభవరూపమైన సాంగత్యంలో ఉండటమే 'సత్సంగం' " అన్న గురుదేవుల మాటలు గమనిస్తే, సద్గురుదేవుని ఉనికి వ్యక్తమవ్వని తావులేదన్నది మనకు అనుభవమయ్యే అంశం.

మనమెక్కడున్నా, మన ధ్యాస ఎక్కడున్నా వారి శ్వాస మాత్రం ఆయన బిడ్డలమైన మనమే! అట్టి సత్పురుషుని ప్రత్యక్ష సన్నిధి లభించకపోయినా, ఆ సన్నిధియొక్క మాధుర్యం లభించే చోటు సత్సంగం. అది కేవలం 'శ్రీ సచ్చిదానంద...' అంటూనే ప్రారంభమవ్వాల్సిన అవసరం లేదు, మనకు హృదయగత మయ్యేట్లు వారికి సంబంధించిన ఏ ఊసు అయినా చాలు అది సత్సంగమే! సత్సంగం గురించి కబీర్ మాటల్ని గమనిద్దాం 'ఇన సత్సంగమే లాభ బహుతహై, తురత మిలావై గురుసే – సద్గురువును గుర్తించగలిగే శక్తిని సత్సంగము శిష్యునికి అందిస్తుంది'. వాచకానికి కాక 'సద్గురువ'న్న మాటే మనకు అనన్యమవుతుందని కబీర్ తన భావాన్ని వ్యక్తం చేసాడు.

**ప్రజల సుఖ, సంతోషాలనాశించి బాటలకు వాలుగా ఎన్నో మొక్కలను నాటించి, తద్వారా తన ప్రజలకు సౌఖ్యాన్ని చేకూర్చాడు అశోకచక్రవర్తి, అవి భౌతికంగా మనకు కళ్ళకు దర్శనమిచ్చేవి.** కరుణామయుడైన సద్గురు చక్రవర్తి 'సత్సంగమనే' మొక్కలను నాటి మనకు నీడనూ, తద్వారా ఆలంబనను ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎందరికో శాంతి, సౌఖ్యాలనే ఫలాలనిస్తూ మొక్కలు వృక్షాలుగా మారి, శాఖోపశాఖలుగావిస్తరించి నేడు దేశ, విదేశాలలో ఎందరికో చల్లని నీడనిస్తూ, ఇహ, పర దాహార్తిని తీరుస్తూ ఆనందానికి నెలవులైనాయి సాయిపథ సత్సంగ కేంద్రాలు.

ఈ జగత్తులో ఎవరైనా బాటసారే. 'ఇహపరశ్రేయోదాయి – సాయి' అన్న గురుమార్గంలో మనం ఎన్నో అవసరాల రీత్యా వివిధ ప్రాంతాలకు వెళుతున్నాము. **సద్గురు సన్నిధానాన్ని అలవోకగా అందించే మన 'సత్సంగం' ఇక్కడ ఉందా?** అని ఒక గురుబంధువుకు వ్యక్తమయిన సందేహమే ఈ శీర్షికకు ఆద్యమయింది. ఈ మొదటి శీర్షికలో విశాఖలోని సత్సంగకేంద్రాలు, నిర్వహించుకునే సమయాలు, వాటి చిరునామాలు మీతో....

**- గురుకృప**

**మృణ్మయ శరీరాలతో మృణ్మయ మందిరాలు నిర్మించడం కాదు**
**చిన్మయ చైతన్యంతో తన్మయ మందిరాలు నిర్మించాలి - ప్రయత్నించు.**



# SAIBABA SATSANG KENDRAS
## VISAKHAPATNAM

**STEEL PLANT :**
Smt. **A. LATHA**,
W/o. Sri. A. Venkateswara Rao,
Plot No. 303 - C, Sector - XI,
Steelplant, Ukkunagaram,
Visakhapatnam - 46.
Ph. No. 2510680
**Saturday - 4.00 p.m. to 6.00 p.m.**

**VUDA COLONY :**
Smt. **A. JHANSHI**,
W/o. Sri. A.V.S. Kumar,
MIG - 2B - 96, Vinayaknagar,
VUDA Colony, Pedagantyada,
Visakhapatnam - 44.
Ph No. : 2515665
**Monday - 2.00 p.m. to 4.00 p.m.**

**KURMANNAPALEM :**
Smt. **V. UMA**,
W/o. Sri. V.V. RamaKrishna Raju,
D.No. 5-146, Kurmannapalem,
Vadlapudi (PO),
Visakhapatnam - 46.
Ph. No. 98483 15592
**Thursday 10.30 am. to 12.00 p.m.**

**KAKANI NAGAR :**
Smt. **K.Ch. REKHA**,
W/o. Sri K. Moulaiah,
D.No. 21-56/1, Kakaninagar,
N.A.D., Visakhapatnam - 9.
Ph : 2571084
**Saturday 6.00 p.m. to 7.30 p.m.**

**VISALAKSHI NAGAR :**
Smt. **LAKSHMI**,
Plot No. 37,
Vishalakshinagar,
Visakhapatnam
Ph. No. 2508122
**Sunday : 5.00 p.m. to 7.00 p.m.**

**MADHAVADHARA :**
Smt. **P. VENKATESWARI**,
39-33-90/1, Near RTA Office,
VUDA Layout, Madhavadhara,
Visakhapatnam - 17.
Ph. No. : 2702054
**Thursday 7.00 p.m. to 9.00 p.m.**

**PEDA RUSHIKONDA :**
Sri **G. VENKATA RAO**,
Peda Rushikonda,
GITAM College (PO),
Visakhapatnam - 45.
Ph. No. : 94406 41508
**Thursday : 6.00 p.m. to 7.00 p.m.**

**CHILDREN SATSANG :**
Mr. **RISHI**,
S/o. G. Hari Prasad
309 - A, Sector - 11,
Ukkunagaram.
Ph. No. 2510283
**First Sunday 4 p.m. to 6 p.m.**


గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి
**leelas@guruji.org** కి mail చేయగలరు.

మీ అనుభవాలు, పత్రికకు మీరిచ్చే సలహాలను సాదరంగా ఆహ్వానిస్తుంది "గురుకృప"

'గురుకృప' - 22-1-50, జి.వి.కాంప్లెక్స్, గాంధీచౌక్, తెనాలి - 522 201

'గురుకృప' - సాయి వరప్రాసాదం, సత్యనారాయణ వీధి, రామలింగేశ్వరపేట, తెనాలి - 522 201

ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : **www.guruji.org**





## రస స్పందన

సద్గురు పద సన్నిధానంలో చరితార్థులైన కొందరు భక్తుల అనుభవాలను, వారిలో కలిగిన స్పందనలను మరొక్కసారి పునశ్చరణ చేసుకుని మనం పులకరించే యత్నాన్ని గత 'గురుకృప' సంచిక ద్వారా ప్రారంభించాం కదా!


భక్తుల గాథలనే, భగవంతుడు విశేషంగా, విశేషణంగా ధరిస్తాడట!

ఎందుకంటే భగవంతుడైన సద్గురువు తన భక్తులనొదలి నిమిషమైనా ఉండలేరు. అట్టి ప్రేమమయులైన మహాత్ముల సన్నిధానం పరమోత్కృష్టమైనది. కనుకనే "మజనకో తుజ ముక్తి సంతాచి యసంగతి భగవాన్! ముక్తి ఉత్కృష్టమైనది అట్టి ముక్తిని ప్రసాదించగలిగిన మహాత్ముని సన్నిధి పరమోత్కృష్టమైనది కనుక మాకు అట్టి మహాత్ముల సాంగత్యం అనుగ్రహిస్తే చాలు అంటూ **తుకారాం** కీర్తిస్తే, మహాత్ముల సహచర్యంలో లభించే భక్తియే ముక్తి యని – **బసవేశ్వరులు**. 'మహాత్ముల సాంగత్యమనునది అత్తరు అంగడిలో సువాసన వంటిది. అంగడి వానికి ఏమీ ఇవ్వకపోయినను అక్కడ వెదజల్లబడే సువాసన నీవనుభవించగలవంటూ' **కబీర్**, 'సత్సంగమనే గంగలో మునక వేసి పవిత్రుడవై, సత్పురుషుల సన్నిధిలో, సంత్ పురుషుల పాదాల చెంత ప్రశాంతతనొందమని' **మీరాబాయి** ప్రవచించారు. ఇందరని, అందరని చెప్పేటందుకు పరిమితి లేదుకదా! 'మనం మన ప్రత్యక్షానుభూతిపై విశ్వాసముంచుదాం (Trust your own experience) అన్న గురుదేవుల వాక్యమే మనకు శ్రేయోదాయకం. గురు సన్నిధానంలో లభించిన స్పందనను – భక్తులు అవగాహన చేసుకున్న తీరును, ఆచరణను గమనిద్దాం.

నా నిజభక్తుడని బాబాచే కొనియాడబడిన మేఘుని చరితను గమనిద్దాం. సాఠే మాట కోసం శిరిడీ వచ్చిన మేఘుడు బాబా యొక్క సర్వజ్ఞతను చూసి ఆశ్చర్య పోయాడు. కానీ తన మొదటి దర్శనంలో బాబాపై విశ్వాసం ఏర్పడలేదు. ఇబ్బందిపడ్డ మేఘుడు మరల శిరిడీ వచ్చి అక్కడే ఉండిపోయాడు. మేఘునికి బాబాపై భక్తి కుదిరి సాయినాథుని అంకిత భక్తుడైనాడు. (He enjoyed Sai's company and his mind at once absorbed at Sai's feet).

స్వతహాగా శివభక్తుడైన మేఘుడు, తన ఆదిదేవుడైన సాయినాథుని గంగాజలంతో అభిషేకించదలచి ధృఢసంకల్పంతో 16 మైళ్ళ దూరంలో ఉన్న గంగను తీసుకొస్తాడు. ఓర్పుతో చాలా సమయం వేచిచూసిన మేఘునికి కేవలం తలపైమాత్రమే నీరును పోయడానికి అనుమతి లభిస్తుంది, కాని భావావేశంలో 'హర హర గంగే' అంటు సచేల స్నానం చేయిస్తాడు. గమనిస్తే కేవలం తల తప్ప ఇక ఏ భాగము తడవదు.

కేవలం తలనే తడపమని బాబా చెప్పిన మాటను మేఘుడు ఉల్లంఘించిన పరిస్థితిని బాబా చక్కదిద్దుతారు. ఇలా బాబా ఇచ్చిన ఈ అనుభవాన్ని మేఘుడు తన జీవిత పర్యంతం



మరల, మరల గుర్తుకు తెచ్చుకుంటూ బాబా యొక్క సర్వసమర్థత్వాన్ని, అపారమైన వారి కరుణను, తనను గుర్వాజ్ఞను ఉల్లంఘింపచేసిన నింద నుంచి విముక్తి చేసిన తీరును మననం చేసుకొని పరవశించిపోయేవాడట. ఆ పారవశ్యం సాయికి తనపైనున్న ప్రేమను, తనకు సాయిపై నున్న ప్రేమను మరింతగా ధృడపరిచేది. కేవలం ఆ పారవశ్యం కోసమే తనకు ఖాళీ సమయం దొరికిన ప్రతిక్షణం బాబాయొక్క ఈ లీలను గుర్తు చేసుకొని తనలో తాను ఆనందించేవాడు. తద్వారా సాయి యొక్క స్మరణలో సదా గడిపి చరితార్థుడయ్యాడు. ఈ సందర్భాన్ని వివరిస్తూ సాయి శరణానందగారు వ్రాసిన మాటలను పునశ్చరణ చేసుకుందాం Megha was astonished and remembering this he rejoiced again and again saying to himself, "what a remarkable characteristic of Baba that pleased me and yet saved me from the **blame of violation of guru's order**".

ఇదే సద్గురు సన్నిధాన ప్రభావం. ఈ సన్నిధానంలో అర్హతలకు, పాత్రతలకుచోటు లేదు. స్పందించే హృదయం అందరిలోనూ ఉంది. అందరిలోనూ ఆ స్పందన కలగచేసే సద్గురువు లభించారు. కేవలం విజ్ఞతతో, స్వీకరించే శక్తిని కూడా ఇచ్చిన సద్గురు అనుగ్రహాన్ని అలవోకగా అందుకొని, అవగాహనతో, ఆచరణతో, మననం చేసుకుంటూ ఉంటే చాలు.

**- గురుకృప**

## స్వర్ణోత్సవ సుమంగా మనం ఏం సమర్పిద్దాం?

సద్గురూ!

మీ సన్నిధానంలో మాకు లభించేది ఎనలేని ఆనందం. అడిగినవి, అడగనివి అన్నీ అందించే మీకు ఏం సమర్పించుకోగలం! సందేహం లేదు, ఏమి సమర్పించినా ఆ కృతజ్ఞత తీర్చుకోలేమని అవగతమయింది. **మీ సన్నిధానం ఆనందం, మీ సన్నిధిని అలవోకగా అందించే సత్సంగం ఆనందం, మీరందించిన ప్రేమను పంచే గురుబంధువులతో సహజీవనం ఆనందం, మీ పాట ఆనందం, మీ మాట ఆనందం, మీరందించిన ఈ జీవితంలో అణువణువూ ఆనందం.**

సద్గురూ! మీ వద్ద కొచ్చిన నాటినుండి కోసుల కొద్దీ దూరం వెళ్ళి మోసులకొద్దీ పుష్పాలు తీసుకొచ్చాను. మీరు కన్పించిన చోటల్లా అలంకరించాను అందంగా – ఆనందించాను, ఆస్వాదించాను. ఆలస్యంగా అర్థమయింది, సమర్పించింది కళ్ళకు కన్పించే పుష్పాలనే అని. పుష్పాన్నడిగాను, సద్గురు పాదసన్నిధిని చేరడానికి నీ వద్ద ఉన్న అర్హతలేమిటని. నావద్ద సద్గురు అనుగ్రహంతో లభించిన సౌందర్యం, సౌకుమార్యం, సౌరభమనే సుగుణాలున్నాయని సమాధానం లభించింది. ఈ లక్షణాలు నాలో ఉన్నాయా? అన్న సాలోచనలో మీరు ఏనాడో ప్రసాదించారని నాకు అవగతమైనది. ఈ జగత్తులోని చరా చర జీవులన్నింటిలోనూ మీ సత్స్వరూపాన్ని దర్శించి, అనుక్షణం జరిగే ప్రతీ చర్యలోనూ మీ